పింఛన్ మంజూరు చేయండి సార్..

పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంటున్న గొడం రామారావ్

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 7: ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని పొన్న ఎక్స్ రోడ్డుకు చెందిన గొడం రామారావ్ తనకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని కోరుతున్నాడు. 15 సంవత్సరాల క్రితం ద్విచక్రవాహనం ఢీ కొనడంతో కాలు, నడుము విరిగిపోయింది. ఎన్నో సార్లు పింఛన్ కోసం అధికారుల దగ్గర దరఖాస్తు చేసుకున్న మంజూరు చేయడం లేదన్నారు. భార్య అన్నపూర్ణతో పాటు నలుగురు పిల్లలు ఉన్నారని, వారి పోషణ భారంగా మారిందని తెలిపారు. అధికారులు స్పందించి తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంటున్నాడు.

వీధి వ్యాపారుల దీక్షలు

నినాదాలు చేస్తున్న వీధి వ్యాపారులు

ఎదులాపురం, జూన్ 7 : వీధి వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలు 18వ రోజుకు చేరుకున్నాయి. శనివారం బక్రీద్ పండుగ రోజు సైతం వ్యాపారులు ఆందోళన కొనసాగించారు. వీరికి ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ మద్దతు తెలిపారు. ఎలాంటి వ్యాపారం లేక పోవడంతో వీధి వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వారికి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.

జొన్నల డబ్బులు వెంటనే విడుదల చేయాలి

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న

బోథ్, జూన్ 7: ఆదిలాబాద్ జిల్లా బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు జొన్నలు విక్రయించి నెల రోజులు గడుస్తున్నా వెంటనే డబ్బులు రైతు ఖాతాల్లో జమ చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానకాలం సీజన్ ప్రారంభమైనందున రైతుల చేతుల్లో డబ్బులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. రైతుల వద్ద విత్తనాలు కొనేందుకు డబ్బులు లేవని పేర్కొన్నారు. వెంటనే జొన్నల డబ్బులు, రైతు భరోసా వెంటనే రైతు ఖాతాల్లో జమ చేయాలన్నారు. లేని పక్షంలో రైతులతో కలిసి రోడ్డుపై ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతులు భరత్, రాం చందర్, విలాస్, రాజు, శంభు , తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సోన్, జూన్ 7: నిర్మల్ జిల్లా సోన్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి బోధించే అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ఎస్‌వో లతాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ సంబంధిత గ్రూపుల్లో బోధన చేయుటకు అభ్యర్థులు పీజీ, బీఈడీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు సోన్ కేజీబీవీలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఘటన దురదృష్టకరం

భైంసా, జూన్ 7 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని అంతర్నిలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం కూలడంతో ముగ్గురు విద్యార్థులు గాయాలు కావడం దురదృష్టకరమని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యులు వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సంగీత పరికరాలు అందజేత

ఖానాపూర్ రూరల్, జూన్ 7: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ సెకండరీ పాఠశాలకు ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ పథకం ద్వారా సంగీత పరికరాలు అందజేశారు. విద్యార్థులు సంగీతంలో సైతం ప్రతిభ కనబరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం ఈకిట్‌ను అందజేస్తుందన్నారు. మృదంగం, తబల, డోలు, వయోలిన్ అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు బోనగిరి నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో వెన్నం అంజయ్య, జాడి శ్రీనివాస్, కిషన్, చాట్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి

ఎదులాపురం, జూన్ 7 : గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్, కో ఇన్‌చార్జి బిక్కి మురళీకృష్ణ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ భవనంలో జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 31వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా గ్రామస్థాయి నుంచి పునర్నిర్మాణం చేపట్టాలన్నారు. అవిర్భావదినోత్సవం రోజున గ్రామంలో జెండా ఆవిష్కరణ జరపాలని తీర్మానించామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కాంబ్లీ బాలాజీ , శ్రీరాముల రాజక్క, వినయ్ సాగర్, గంగయ్య, ఎల్లన్న, గణేశ్, రాంప్రసాద్, నవీన్, వేణు, మడిపల్లి మనోజ్, పోచన్న, స్వామి, రాకేశ్, బాలాజీ, నారాయణ, సూర్యప్రసాద్, రాచర్ల శరత్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

జైనథ్, జూన్ 7 : జైనథ్ నుంచి చేనులకు వెళ్లడానికి రూ.28 లక్షల నిధులతో 5 కిలో మీటర్ల దూరం చేపడుతున్న రోడ్డు నిర్మాణానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం, జూన్ 7: విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నాయకుడు మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ఓపెనింగ్ పర్మిషన్స్ ఇస్తున్న విద్యాధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు రాయితీతో అడ్మిషన్లు పొందేవారు అన్నారు. సదరు పాఠశాలలో తమ పిల్లలను చదివించాలనే కోరిక, ఆశ తీరేదిగా అన్నారు. కానీ, జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల పాఠశాల యాజమాన్యం మాత్రం ధనార్జనే ధ్యేయంగా డబ్బులకే ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు దిగంబర్, రాజు, సచిన్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే నాణ్యమైన విద్యుత్

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- వాంకిడిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ


విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూన్ 7 : కేసీఆర్ హయాంలోనే ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశామని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని వాంకిడి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే ఇక్కడి గ్రామాల ప్రజలకు విద్యుత్ కష్టాలు దూరమవుతాయన్నారు. రైతులకు కూడా సాగునీటికి అవాంతరాలు లేకుండా సజావుగా సాగునీటితో పంటలు పండించుకోవచ్చని సూచించారు. 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో వాంకిడి పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు మంచి ప్రయోజనం చేకూరనుందన్నారు. ప్రభుత్వం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.1.86 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. వాంకిడి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సావాయిరాం, జాదవ్ రమేశ్, రాజు, శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు జాదవ్ గణేశ్, శ్రీనివాస్ యాదవ్, రాథోడ్ సురేందర్, గులాబ్‌సింగ్, అనిల్‌యాదవ్, నజీర్, భారత్, విద్యుత్‌శాఖాధికారులు, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల భవనం కూలిన తర్వాత
కళ్లు తెరిచిన విద్యాశాఖ

కూలిన పాఠశాల భవన శిథిలాలను తొలగిస్తున్న జేసీబీ

అధికారులపై మండి పడుతున్న స్థానికులు

కుభీర్, జూన్ 7: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని అంతర్ణి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం కూలిపోవడంతో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. పదేళ్లుగా ఖాళీగా ఉన్న భవనంపై ముందస్తు చర్యలు తీసుకోని విద్యాశాఖ అధికారులు ప్రమాదం జరిగిన తర్వాతే స్పందించారని గ్రామస్తులు మండిపడ్డారు. ఘటన సమయంలో భవనంలో ఆడుకుంటున్న ఏడుగురు చిన్నారులు మృత్యువు ఒడికి చేరేవారు. సమీప నివాసితురాలు గోరేకర్ స్వప్న శబ్దం విని వెంటనే పరుగెత్తి వెళ్లి పిల్లలను రక్షించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం శిథిలాల తొలగింపునకు వచ్చిన అధికారులను గ్రామస్తులు ఆగ్రహంతో నిలదీశారు. ఇప్పుడొచ్చి శిథిలాలు తొలగించడం ఏమిటి అని వారు ప్రశ్నించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్ ఎదుట నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. అందరికి సర్ధిచెప్పి జేసీబీతో శిథిలాలను తొలగింప చేశారు. ఎంఈవో విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి విజయ్, హెచ్ఎంలు దొంతుల సురేశ్, సుభాష్, ఉపాధ్యాయులు నాగభూషణ్, కత్తి నాగోరావు, సోషల్ వర్కర్ పబ్బు ధర్మపురి, స్థానికులు ఉన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా..

కుభీర్, జూన్ 7: నిర్మల్ జిల్లాలోని మండలాల వారిగా కూలిపోయే పరిస్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల జాబితాను తయారు చేయించి ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే కూల్చివేయాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుభీర్ మండలం అంతర్నిలోని శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం డిస్‌మెంటల్ చేయాలని స్థానికులు పలుమార్లు కోరినప్పటికీ ప్రమాదం జరిగి ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడితే గాని విద్యాశాఖ కళ్లు తెరవకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కల్పించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల భవనాలను తనిఖీ చేయించి పూర్తిగా ఫిట్‌నెస్ కలిగి ఉంటేనే అందులోకి విద్యార్థులను అనుమతించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి

సోన్, జూన్ 7: పసుపు పంటను సాగు చేస్తున్న ఓ యువకుడు నీటిని పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కూచన్‌పల్లి గ్రామానికి చెందిన ఇందూరి మణిచందర్ (21) అనే యువకుడు శుక్రవారం తన పంటకు సాగు నీరు పెట్టేందుకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసి మళ్లీ తోటలోకి వెళ్లాడు. సాయంత్రమైన ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి చుట్టుపక్కల వెతికాడు. అనుమానంతో చివరకు బావిలో వెతకగా యువకుడు మృతి చెందినట్లు కనిపించాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి లేదా మరే ఇతర కారణాల వలన బావిలో పడి మరణించాడని తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

తానూర్, జూన్ 7 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని జవులా(కే) గ్రామంలో ప్యాదేకర్ అశోక్ చెందిన ఆవు శనివారం ఉదయం మేతకోసం వెళ్లి అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తగిలి మృతి చెందింది. బాధితునికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్మల్‌అర్బన్ : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఎదులాపురం: సేమియా తాగుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నమస్తే నెట్‌వర్క్, జూన్ 7 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో శనివారం ముస్లింలు భక్తి ప్రపత్తులతో బక్రీద్ పండుగను జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి పిల్లలు, పెద్దలు అంతా ఈద్గాలు, మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు మత సందేశం వినిపించారు. అనంతరం ముస్లింలు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకీషర్మిల, ఏఎస్పీ రాజేశ్ మీనా, అవినాశ్ కుమార్ నేతృత్వంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆదిలాబాద్‌లో జోగు రామన్న, వాంకిడి, నేరడిగొండ గ్రామాల్లో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌తో పాటు ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సెలవు నాడు విధులు


దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారులు, సిబ్బంది

దస్తురాబాద్, జూన్ 7 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో శనివారం(బక్రీద్) సెలవు దినంలో సైతం అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించారు. శుక్రవారం వరకు భూత్కుర్, దస్తురాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ రెండు గ్రామ పంచాయతీల్లో 340 మంది రైతులు వివిధ భూ సమస్యలపై దరఖాస్తులు ఇచ్చినట్లు తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ తెలిపారు. దస్తురాబాద్‌లో 203, భూత్కుర్‌లో 137 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సెలవు రోజులో డీటీ యాదవరావు, జూనియర్ అసిస్టెంట్లు సురాజ్, మధు, అభిలాష్, సిబ్బంది వెంకటేశ్, శ్యాంరావు, పోషం విధులు నిర్వహించారు.

విద్యార్థులు కంప్యూటర్ విద్యను నేర్చుకోవాలి

ఉట్నూర్ రూరల్, జూన్ 7 : విద్యార్థులు కంప్యూటర్ విద్యను నేర్చుకోవాలని మండల నోడల్ అధికారి భరత్ చౌహాన్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని తాండ్ర బాబాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తన సొంత ఖర్చులతో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వామి, దినేశ్, చంద్రమోహన్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బోథ్ : కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, జూన్ 7 : ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలంలోని దేవుల్‌నాయక్ తండా గ్రామానికి చెందిన జాదవ్ గణేశ్ భార్య జాదవ్ పుష్పలత అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను శనివారం శనివారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సుధీర్ రెడ్డి, అభిలాష్, భీంరావ్ పాటిల్, మాజీ ఎంపీటీసీ రోహిదాస్, చిన్నయ్య, హరీశ్ ఉన్నారు.

జైనథ్, జూన్ 7 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మాజీ సర్పంచ్ గడ్డం రాజారెడ్డి భార్య త్రివేణి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు లింగారెడ్డి, మార్కెట్టి గోవర్ధన్, గణేశ్ యాదవ్, దుమ్మాలా దేవన్న, వెంకట్ రెడ్డి ఉన్నారు.

అంత్యక్రియలో పాల్గొన్న మాజీ మంత్రి

బేల, జూన్ 7: ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని బెదోడ గ్రామానికి చెందిన అంజనీబాయి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి జోగు రామన్న గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. రైతు మనోహర్, ప్రమోద్ రెడ్డి, భానుచందర్ ఉన్నారు.

బేల: అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న

స్వప్న దవాఖానలో అరుదైన ఉచిత ఆపరేషన్

చికిత్స పొందిన ఉత్తమ్, మణి

నిర్మల్ అర్బన్, జూన్ 7: హైదరాబాద్ వంటి నగరాలకు దీటుగా నిర్మల్‌లోని స్వప్న మల్టీ స్పెషాలిటీ దవాఖాన వైద్యులు అరుదైన ఉచిత ఆపరేషన్ నిర్వహించినట్లు డాక్టర్ నాళం శశికాంత్ తెలిపారు. 30 సంవత్సరాల వయస్సున్న మణి ఇంటి పనులు చేస్తుండగా కింద పడింది. 60 సంవత్సరాల వయస్సున్న ఉత్తమ్ 2022లో వెన్ను పూస దెబ్బతినడంతో ఓ దవాఖానలో ఆపరేషన్ చేయించుకున్న అది విజయవంతం కాకపోవడంతో కూర్చోవడం, లేవలేని స్థితిలో ఉన్నాడు. వీరిద్దరు ఇటీవల దవాఖానకు రాగా ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యులు నాళం శశికాంత్ ఆధ్వర్యంలో నరాల వైద్య నిపుణుడు సచిన్ ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం వీరిద్దరి ఆరోగ్యం మెరుగుపడి నడుస్తున్నారని హైదరాబాద్ వంటి మహా నగరాలలో కార్పొరేట్ దవాఖానల్లో అధిక డబ్బులతో చేసే వైద్యం నిర్మల్‌లోని స్వప్న దవాఖానలో తక్కువ ఖర్చుతో, అర్హత ఉంటే ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా చేస్తున్నామని జిల్లాలోని ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వారంలోనే 15 ఫిర్యాదులు

- సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 నంబర్‌కు సంప్రదించాలి
- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, జూన్ 7 : భవిష్యత్‌లో ప్రజలు సైబర్ నేరాలకు గురయ్యే అవకాశం అధికంగా ఉందున నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 నంబర్‌ని సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ వారంలో 15 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల బారిన పడిన గంట లోపు ఫిర్యాదు చేస్తే ఆర్థిక నష్టం జరిగినా వాటిని తిరిగి రప్పించే అవకాశం ఉందన్నారు. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయడం చాలా ముఖ్యమైనదని తెలిపారు. వాట్సాప్ గ్రూపుల్లో ఎలాంటి ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోకుండా ఉండాలని, వాటి ద్వారా మొబైల్ ఫోను సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తుందని, ఇలాంటి వాటికి గురైనప్పుడు పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు.

తప్పిపోయిన చిన్నారిని కుటుంబీకులకు అప్పగింత

చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున పోలీసులు

నిర్మల్ అర్బన్, జూన్ 7: నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంజులాపూర్‌లో ఐదు సంవత్సరాల గుల్లె తనుశ్రీ అనే చిన్నారి శనివారం తప్పిపోయి రోడ్డుపై ఉండగా వెంటనే స్పందించిన రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది వారి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు. మానవతా దృక్పథంతో తక్షణమే స్పందించిన రూరల్ ఎస్ఐ లింబాద్రి, ఏఎస్ఐ బాబారావు, మహిళా కానిస్టేబుల్ లక్ష్మీ పరిమళను ఎస్పీ ప్రశంసించారు.

మారుతున్న కాలానుగుణంగా బోధన చేయాలి

నిర్మల్ అర్బన్, జూన్ 7: రోజురోజుకు మారుతున్న కాలానికి సాంకేతిక, పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని ప్రముఖ సైకాలజిస్ట్ మల్లికార్జున రావు అన్నారు. నిర్మల్‌లోని తన్వి ఫంక్షన్ హాల్‌లో వాసవి గ్రూప్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు చేతిరాత తరగతుల సదస్సు నిర్వహించారు. అనంతరం ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు రుత్విక్, రాకేశ్, శ్రీవాణి, శ్రీ సాయి, లిఖిత్, వసుంధరను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోతారెడ్డి, సెక్రటరీ జగదీశ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుహాసిని, షైలా జాయ్ సన్, రాజ్ కుమార్, శ్రీనివాస్ శెట్టి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కూలిన పాఠశాల భవనం

భైంసా, జూన్ 7 : కుభీర్ మండలంలోని అంతర్నిలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం కూలడంతో ముగ్గు రు విద్యార్థులకు గాయాలై భైంసా ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. శనివారం దవాఖానకు ఎమ్మెల్యే రామారావు పటేల్ వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ఘటన జరిగిందన్నారు. అందుకు బాధ్యులైన జిల్లా విద్యాధికారిని తక్షణమే సస్పెండ్ చేసి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను కూల్చివేయాలని సూచించారు.

వ్యవసాయ యంత్రాల వినియోగంపై అవగాహన

బోథ్, జూన్ 7: ఆదిలాబాద్ జిల్లా సొనాలలో నూజివీడు సీడ్స్ కంపెనీ ప్రతినిధులు శనివారం రైతులకు వ్యవసాయ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి రాంమోహన్ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే యంత్రాల వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. నూజివీడు సీడ్స్ వారు రూపొందించిన సుబిజ్ కిసాన్ యాప్, సుబిజ్ సరళ యాప్ వినియోగించుకుని వాతావరణ సూచనలు, చీడపీడలు ఎలా నిర్మూలించుకోవాలో తెలుసుకోవచ్చన్నారు. అనంతరం రైతు రాంరెడ్డికి కంపెనీ తరపున మాన్యువల్ సీడర్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నూజివీడు సీడ్స్ సేల్స్ ఆఫీసర్ మహేందర్, రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

CHANGE OF NAME

★My Son Master KATTA DAKSHITH, Age: 4 years, Student of Class LKG, shall henceforth be Known as KATTA VIRAT, S/o. Katta Prasad Chary.
NT-347203

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రక